## హెచ్-1బీ జారీలో మార్పులు

- నిబంధనలను సరళీకరించనున్న అమెరికా ప్రభుత్వం




వాషింగ్టన్, అక్టోబర్ 22: అమెరికాలో విదేశీ ఉద్యోగులకు జారీచేసే హెచ్-1బీ వీసా ప్రక్రియలో మార్పులు చేయాలని బైడెన్ ప్రభుత్వం భావిస్తున్నది. దీనిలో భాగంగా ఆ వీసాలకు సంబంధించిన అర్హతా ప్రమాణాలను సరళీకరించి వాటి జారీ ప్రక్రియ సామర్థ్యాన్ని మెరుగుపర్చాలని యోచిస్తున్నది. దీనితో పాటు ఎఫ్-1 వీసా విద్యార్థులకు, పారిశ్రామికవేత్తలకు, లాభాపేక్షలేని సంస్థల తరపున పనిచేసేవారికి, వలసేతర కార్మికులకు వర్తించేలా సరళీకృత నిబంధనలను తీసుకురానున్నది. అయితే ఏటా జారీచేసే 60 వేల వీసాల పరిమితిలో ఎలాంటి మార్పు ఉండదు. కొత్త నిబంధనలను అమెరికా పౌరసత్వ, వలస సేవల (యూఎస్‌సీఐఎస్) విభాగం ఈ నెల 23న ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించనున్నది. దీంతో లాటరీలో వీసాను దక్కించుకునేందుకు ఒకే వ్యక్తి పలు మార్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు. ప్రపంచ దేశాల్లోని ప్రతిభావంతులను అమెరికాకు ఆకర్షించడం, ఉద్యోగులు, యాజమాన్యాలపై భారాన్ని తగ్గించడం, హెచ్-1బీ వీసా జారీలో పారదర్శకతను పెంపొందించడం కోసం ఈ ప్రతిపాదనలు చేశారు.

## భారత వ్యవహారాల్లో నిరంతర జోక్యం వల్లే

- కెనడా దౌత్య సిబ్బంది తగ్గింపుపై జైశంకర్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారత్, కెనడా సంబంధాలు క్లిష్టదశలో ఉన్నాయని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. భారత వ్యవహారాల్లో కెనడా దౌత్య సిబ్బంది నిరంతరం జోక్యం చేసుకుంటున్నారనే ఆందోళనలున్నాయని, ఈ నేపథ్యంలోనే సిబ్బంది సంఖ్య విషయంలో సమానత్వం ఉండాలని కోరామన్నారు. దౌత్య సిబ్బందిని తగ్గించుకోవాలని భారత్ అల్టిమేటం జారీచేసిన నేపథ్యంలో కెనడా 41 మంది సిబ్బందిని ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. మరోవైపు, కెనడాలోని భారత దౌత్యవేత్తల భద్రత విషయంలో పురోగతి కనిపిస్తే.. వీసాల జారీ ప్రక్రియ పునఃప్రారంభిస్తామని జైశంకర్ చెప్పారు.

# బ్యూరోక్రాట్లతో రాజకీయ ప్రచారం!

- కేంద్ర పథకాల ప్రచారానికి అధికారులు
- నరేంద్ర మోదీ సర్కారు తాజా ఆదేశాలు
- ఇటీవలే సైన్యానికి ఇదే తరహా ఉత్తర్వులు
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విపక్షాలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 22: ఎన్నికల ముందర రాజకీయ లబ్ధి కోసం కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్రభుత్వ వ్యవస్థలను వాడుకుంటున్నది. దేశవ్యాప్తంగా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని ఇటీవల సైన్యానికి ఆదేశాలు ఇవ్వడం దుమారం రేపిన సంగతి తెలిసిందే. దీనిపై వివాదం సద్దుమణకముందే తాజాగా బ్యూరోక్రాట్లను కూడా కేంద్రం రంగంలోకి దించింది. కేంద్ర ప్రభుత్వంలోని 12 విభాగాలకు చెందిన అధికారులను రథ్ ప్రభారిస్ (ప్రత్యేక అధికారులు)గా నియమించి, వారి ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలను 'మార్కెటింగ్' చేసుకొని రానున్న అయిదు రాష్ట్రాల శాసన సభ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నది. కేంద్రం తాజా నిర్ణయం ప్రకారం నవంబర్ 20 నుంచి రెండు నెలల పాటు ఆదాయపన్ను, తపాలా, టెలికం, అటవీ, కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో దేశంలోని 2.69 లక్షల గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకంగా రూపొందించిన రథాల్లో తిరుగుతారు. ఎన్డీయే ప్రభుత్వం గత తొమ్మిదేండ్లలో సాధించిన విజయాలను ప్రచారం చేస్తారు. ఈ యాత్రలో వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను, లబ్ధిదారులు కాని వారిని వారు కలుస్తారు. ఈ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగాన్ని కేంద్రం దుర్వినియోగం చేస్తున్నదని విపక్షాలు మండిపడ్డాయి.

**బ్యూరోక్రసీ రాజకీయీకరణ**


కేంద్ర ప్రభుత్వం పథకాల ప్రచారానికి సైనికులను, అధికారులను వాడుకోవడంపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అధికారులతో ప్రచారం నిర్వహించడం బ్యూరోక్రసీని రాజకీయికరణ చేయడమేనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. కేంద్ర సివిల్ సర్వీసుల(ప్రవర్తన) నియమావళి-1964 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులెవరూ ఏ రాజకీయ కార్యక్రమంలో పాల్గొనకూడదని.. కేంద్రం తాజా నిర్ణయం దాన్ని ఉల్లంఘిస్తున్నదని తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించడం కోసం అధికారులను మార్కెటింగ్ కార్యకలాపాలకు వాడుకొంటున్నారని విమర్శించారు. 'ఇప్పుడు మోదీ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వ అన్ని శాఖలు, సంస్థలు, వ్యవస్థలు, విభాగాలు అధికారికంగా 'ప్రచారక్‌లు'' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



గ్లోబల్ లీడర్‌షిప్ పురస్కారం స్వీకరిస్తున్న జస్టిస్ డీవై చంద్రచూడ్

## సీజేఐకి హార్వర్డ్ లా స్కూల్ పురస్కారం

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు 'అవార్డ్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్'ను హార్వర్డ్ లా స్కూల్‌లోని సెంటర్ ఆన్ ది లీగల్ ప్రొఫెషన్ శనివారం ప్రదానం చేసింది. ఆయన ఈ పురస్కారాన్ని హార్వర్డ్ లా స్కూల్‌లో స్వీకరించారు. దీని కోసం ఆయనను ఎంపిక చేసినట్లు ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పురస్కారాన్ని స్వీకరించిన సందర్భంగా జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ, ఈ కళాశాలలో తాను చదువుకున్ననాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. తాను సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అమలు చేసిన సంస్కరణలను వివరించారు. విద్యార్థులు ఇంటర్‌డిసిప్లినరీ స్టడీస్ చేయాలని సూచించారు. మెడికల్ సైన్స్, టెక్నాలజీ వంటివాటికి న్యాయశాస్త్రంతో సంబంధం ఉంటుందన్నారు.



## డయాబెటిక్ గాయాలను వేగంగా మాన్పే జెల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 22: డయాబెటిక్ రోగుల్లో గాయాలు అంత సులభంగా మానవు. గాయం పెద్దదయితే అవయవాన్నే తొలగించే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు 'నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్' (ఎన్‌యూఎస్) సైంటిస్టులు సరికొత్త చికిత్సా విధానాన్ని అభివృద్ధి చేశారు. డయాబెటిక్ గాయాలను మూడు రెట్లు వేగంగా రూపుమాపే 'మ్యాగ్నెటిక్ జెల్'ను తయారుచేశారు. గాయమైన చోట హైడ్రోజెల్ పూతవున్న బ్యాండెజ్ వేశాక, ఒక వైర్‌లెస్ మాగ్నెటిక్ పరికరంతో దెబ్బతిన్న కణజాలాన్ని ఉత్తేజితం చేస్తామని సైంటిస్టులు తెలిపారు. దీంతో దెబ్బతిన్న కణజాలం వేగంగా కోలుకోవడానికి ఇదెంతగానో దోహదపడుతుందని వారు చెప్పారు. చికిత్సా సమయం ఒకటి నుంచి రెండు గంటలు ఉంటుందని, మూడు రెట్లు వేగంగా గాయం నయమవుతుందని వెల్లడించారు.

# గాజాపై దాడులు తీవ్రం

- విరుచుకుపడిన ఇజ్రాయెల్ సైన్యం
- సిరియా ఎయిర్‌పోర్టులపై మళ్లీ దాడి
- వెస్ట్‌బ్యాంక్‌పైనా వైమానిక దాడులు
- పాలస్తీనియన్లకు భారత్ మానవతా సాయం



పాలస్తీనియన్లకు సహాయ సామగ్రి తరలిస్తున్న భారత సిబ్బంది

జెరూసలేం/గాజా సిటీ, అక్టోబర్ 22: హమాస్‌తో యుద్ధంలో భాగంగా గాజా స్ట్రిప్‌పై దాడులను మరింత తీవ్రతరం చేస్తామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. యుద్ధాన్ని తదుపరి దశకు తీసుకెళ్లేందుకు అనుకూల పరిస్థితులు సృష్టించుకోవడమే లక్ష్యంగా పెట్టుకొన్నట్టు ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డేనియల్ హగారీ తాజాగా వెల్లడించారు. హమాస్ మిలిటెంట్ల నుంచి తమ బలగాలకు ముప్పు ఎదురుకాకుండా తగిన ప్రణాళికలు అనుసరిస్తామని పేర్కొన్నారు. గాజా సిటీలోని పౌరులు దక్షిణ గాజాలోకి వెళ్లిపోవాలని ఆయన మరోసారి పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు గాజాపై వైమానిక దాడులు చేస్తున్న ఇజ్రాయెల్.. హమాస్‌ను పూర్తిగా నాశనం చేసే లక్ష్యంతో తదుపరి భూతల దాడులు చేపట్టాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. గాజాలో పాలనను హమాస్ నుంచి మార్చేందుకు మూడు దశల వ్యూహంతో ముందుకెళ్లనున్నట్టు ఇటీవల ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ప్రకటించారు. అందులో భాగంగా ప్రస్తుతం రెండో దశ దాడులకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది.

**సిరియా విమానాశ్రయాలపై మరోసారి దాడులు**

గాజాతో పాటు వెస్టుబ్యాంకు, సిరియాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తున్నది. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు గాజాలోని పలు ప్రాంతాలపై వైమానిక దాడులు చేసింది. సిరియాలోని డమాస్కస్, అలెప్పో ఎయిర్‌పోర్టులపై మరోసారి బాంబు దాడులకు పాల్పడింది. రన్‌వేలు దెబ్బతినడంతో సర్వీసులకు అంతరాయం ఏర్పడిందని స్థానిక మీడియా పేర్కొన్నది. ఆక్రమిత వెస్టుబ్యాంక్ పరిధిలోని ఓ మసీదుపై దాడి చేసింది.

**మరో 17 ట్రక్కుల్లో సహాయక సామగ్రి**

గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయంలో భాగంగా ఆదివారం 17 ట్రక్కుల కాన్వాయ్ ఈజిప్టు గుండా గాజా స్ట్రిప్‌కు చేరింది. ఇందులో భాగంగా ఆహారం, నీరు, వైద్య సాయం అందించనున్నారు. భారత్ కూడా ఆదివారం 6.5 టన్నుల మేర వైద్య సామగ్రి, 32 టన్నుల విపత్తు ఉపశమన సామగ్రిని సీ-17 రవాణా విమానం ద్వారా పంపింది. ఇవి ఈజిప్టులోని ఎల్ అరిష్ ఎయిర్‌పోర్టుకు చేరుకొంటాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి వెల్లడించారు.

**వారిని ఏరివేసేందుకు ప్రత్యేక యూనిట్**

ఈ నెల 7న ఇజ్రాయెల్‌లో హమాస్ సృష్టించిన మారణహోమం వెనుక ఉన్న ప్రతి ఒక్కరినీ ఏరివేసేందుకు ఇజ్రాయెల్ నిఘా ఏజెన్సీ షిన్ బెట్ త్వరలో 'నిలి' పేరుతో ఓ కొత్త యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నది.

## సరిహద్దులో భారీగా చైనా నిర్మాణాలు

- పెరిగిన బలగాల మోహరింపులు
- అమెరికా రక్షణ శాఖ నివేదిక వెల్లడి

వాషింగ్టన్, అక్టోబర్ 22: భారత్‌తో నెలకొన్న సరిహద్దు ఉద్రిక్తతలు, గల్వాన్ ఘర్షణల నేపథ్యంలో 2022లో చైనా వాస్తవధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంట బలగాల మోహరింపును పెంచిందని, అదేవిధంగా సరిహద్దు ప్రాంతా ల్లో పెద్దయెత్తున మిలటరీ నిర్మాణాలు కొనసాగించిందని అమెరికా రక్షణ శాఖ తన తాజా నివేదికలో వెల్లడించింది. డోక్లాం సమీపంలో అండర్ గ్రౌండ్ స్టోరేజీ సదుపాయాలు నిర్మించిందని, ఎల్‌ఏసీలోని మూడు సెక్టార్ల పరిధిలోని రోడ్లు, అదేవిధంగా ప్యాంగ్యాంగ్ సరస్సుపై రెండవ బ్రిడ్జి, సైనిక-పౌర అవసరాలకు వినియోగించే విమానాశ్రయం, పలుచోట్ల హెలిప్యాడ్లు, భూటాన్ సరిహద్దులోని వివాదాస్పద ప్రాంతంలో కొత్త గ్రామాల నిర్మాణాలు చేపట్టిందని పెంటగాన్ తెలిపింది. చైనా 2022లో ఎల్‌ఏసీ వద్ద ఒక బోర్డర్ రెజిమెంట్‌ను మోహరించిందని పేర్కొన్నది. దీనికి తోడు జిన్‌జియాంగ్, టిబెటన్ మిలటరీ డిస్ట్రిక్ట్స్‌కు చెందిన రెండు డివిజన్లు, వీటితో పాటు నాలుగు కంబైన్డ్ అర్మ్స్ బ్రిగేడ్స్(సీఏబీ)లను వెస్టర్న్ సెక్టార్‌లో రిజర్వ్‌లో ఉంచినట్టు వెల్లడించింది. అదేవిధంగా చైనా వద్ద ప్రస్తుతం 500 న్యూక్లియర్ వార్‌హెడ్‌లు ఉన్నాయని, 2023 నాటికి అవి వెయ్యికి పైగా చేరే అవకాశం ఉన్నదని పెంటగాన్ తన నివేదికలో అంచనా వేసింది.

## అగ్నివీర్ మరణిస్తే కోటి పరిహారం!

న్యూఢిల్లీ: విధి నిర్వహణలో అగ్నివీర్ మరణిస్తే, వారి కుటుంబసభ్యులకు కోటి పరిహారం అందించనున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నాన్ కంట్రిబ్యూటరీ ఇన్సూరెన్స్ కింద రూ.48 లక్షలు, నష్టపరిహారంగా రూ.44 లక్షలు, అగ్నివీర్ కంట్రిబ్యూట్ చేసిన సేవా నిధిలో 30 శాతం, దానికి సమానంగా ప్రభుత్వ కంట్రిబ్యూషన్, వడ్డీ, నిర్ణీత నాలుగేళ్ల కాలంలో మిగిలిన కాలానికి జీతం ఆ కుటుంబాలకు లభిస్తాయని వివరించాయి. సియాచిన్ మంచు కొండల్లో ఆపరేటర్‌గా పని చేస్తున్న అగ్నివీర్ గవటే అక్షయ్ లక్ష్మణ్ ఆదివారం విధి నిర్వహణలో మరణించారు.





